తెస్తే వెలనాడు కాదు గదా.. అనుమకొండ కూడా రాదు. ఇది నేను చెప్పానని చెప్పకురోయ్.. మళ్లా ఎటో పోతాడు..' ఇలా వారానికో టపా.

అక్క చెప్పినా చెప్పకపోయినా జాయపునికి ఏమాత్రం అసౌకర్యం కలిగించకూడదని పృథ్వి అన్నదమ్ముల ఏకాభిప్రాయం. ఇవన్నీ జాయపునికి చెప్పలేక తగిన సమయంకోసం చూస్తుండగా.. ఈ సాహితీ సమావేశంతో ఈ సమస్యలన్నీ ఓ కొలిక్కి వచ్చినట్లు నిట్టూర్చాడు పృథ్వి.

పిల్లలకు జాయపుడు బాగా మాలిమి అయ్యాక.. వాళ్లు ఆయన్ను వదిలిపెట్టడం లేదు. ఉదయం లేవగానే ఆయన మందిరానికే పోతున్నారు. రాత్రి జాయపుడు పాట పాడుతూ నాట్యం చేస్తే గానీ నిద్రపోవడం లేదు.

ఇప్పుడు కుటుంబసభ్యులంతా ఉల్లాసంగా.. తలగడ దీవి కోట అంతా ఉత్సాహంగా కళకళలాడుతున్నది.

ద్వీపరాజ్యపు కళాకారులతో సమావేశం జాయపునికి కూడా కళాతృప్తిని కలిగించింది.

''తమరు పరిపాలనను ఎందుకు తక్కువగా చూస్తున్నారు మండలేశ్వరా?'' అన్నాడో కవీశ్వరుడు నవ్వుతూ.

జాయపుడు అంతే సరదాగా సమాధానమిచ్చాడు.

''సుకవితా యద్యస్తి రాజ్యేన కిం (కవిత అనే ఆస్తి ఉండగా రాజ్యం ఎందుకు) అన్నాడు భర్తృహరి. అధికారం శత్రువులను తెచ్చి పెడుతుంది. కానీ, కళ కళాత్మక జీవుల మధ్య మిత్రత్వాన్ని పెంచి పెడుతుంది!''..

అందరూ చప్పట్లతో హర్ష ధ్వానాలు చేశారు. కానీ, కళాత్మక జీవుల మధ్య మతం చిచ్చుపెడుతున్నదని.. త్వరలోనే కళాకారుల మతోన్మాదం వల్ల తానొక మత యుద్ధంలో పాల్గొనబోతున్నట్లు మండలేశ్వరుడు జాయపచోడునికి అప్పటికి తెలియదు.

* * *

తొలి సమావేశం ఎంతో ఆహ్లాదంగా జరిగింది.

రాయడం రాకముందే మాట్లాడటం ఉంది. అప్పుడే శ్రుతసాహిత్యం, గేయం, సంగీతం ఉన్నాయి. రాత మరింత స్పష్టమయ్యాక.. చందస్సుతో కూడిన తెలుగు భాష దృఢమయ్యాక.. ఇప్పుడు అన్ని లిఖితసాహిత్య, ప్రదర్శనా కళలతో విప్పారి వికసిస్తున్నది. రోజురోజుకూ కొత్తకొత్త పండితులు, కవులు, సంగీత, నాట్య, వాద్య ప్రదర్శనకారులు పుట్టుకు వస్తున్నారు. లిఖిత సాహిత్యంలో ఇప్పటికే ద్విపద, మంజరీ ద్విపద, చంపూ, రగడ.. లాంటి ఛందస్సులు, సాహితీరీతులు ఉండగా వర్తమానకవులు మరిన్ని ప్రయోగాలు చేస్తున్నారు. ఇవి ఎక్కువగా కులీన సమాజంలో పరిఢవిల్లుతుండగా.. వాగ్గేయకారులు, గాయకులు తమతమ గేయాలను, పాటలను, సంగీతంతో అనుసంధానం చెయ్యడానికి.. తద్వారా సామాన్య జనసమూహాలలో తమ రచనారవళి మరింత ప్రాచుర్యం పొందాలని కృషిచేస్తున్నారు. అయితే కళలన్నీ సామాజిక జీవితాన్ని రసభరితం చేస్తూనే మతంతో పెనవేసుకుని ఎదగడం జాయపునికి కనిపిస్తున్నది.

పెద్దన కళాగృహంలో కవి పండితులతో సమావేశాల వల్ల వర్తమాన సాహిత్యం, మతవాదులైన సాహితీవేత్తల మధ్య మత కలహాలు, గుంపులుగా గొడవలు వింటున్నాడు. ఇదే ధనదుపురంలో గతంలో చోడరాజుల కాలంలో ఓ శైవగ్రంథ కర్త.. బౌద్ధ పండితుని కళ్లు పెరికివేశాడని, మరోచోట శైవ పండితుల తాళపత్రాలను జైనులు తగుల బెట్టారని.. కాదు జైనుల రచనలను సంస్కృత పండితులే నదిలో పారవేయించారని.. ఇలాంటివి ఎన్నో..

బుద్ధుని ప్రవచనాలు బౌద్ధమనే మతరూపం తీసుకుంటే.. నాగార్జునుడు, ఆర్యదేవుడు తదితర మహాప్రవక్తలు పుట్టారు. శంకరచార్యుని వల్ల కొందరు.. బసవన్న వల్ల కొందరు.. ఇప్పుడు రామానుజుని వల్ల కొందరైతే తిక్కన వంటి హరిహరాత్మజులు మరికొందరు.

తాదాత్మ్యత చెంది.. ప్రగాఢ ప్రభావితులై ఎన్నో ప్రబంధాలు, కావ్యాలు, యక్షగానాలు, కృతులు, పదాలు, పాటలు రాస్తూ నాట్యీకరించి ప్రదర్శిస్తూ.. సమాజాన్ని తన్మయత్వంలో ముంచెత్తుతున్నారు.

రేపు మరో ప్రభావశీలి వస్తాడు. మరో మతం పుడుతుంది. మరికొందరు అద్భుత గ్రంథకర్తల రచనలు వస్తాయి. అక్కడెక్కడో క్రీస్తు.. ఆయన పేరుపై క్రైస్తవ మఠ. ఎన్నో క్రైస్తవగ్రంథాలు. అటెటో ఇస్లామత. మరింతమంది మహా గ్రంథకర్తలు.. అన్నింటా తాదాత్మ్యం.. తన్మయత్వం.. ప్రగాఢ ప్రభావితం!

* * *

తలగడదీవి ఆస్థాన సమావేశాలలో జాయపుణ్ని ఆకర్షించినవాడు ఆస్థాన నాట్యాచార్యుడు కంకుభట్టు. కారణం.. అతను ఎలాంటి మతచిహ్నాలు ధరించలేదు. విబూది లేదు, తిరునామం లేదు. సాధారణ నాట్యాచార ఆహార్యం. తన ఈడువాడు. అంత చిన్నవాడు ఆస్థాన నాట్యాచార్యుడు ఏమిటని ఆశ్చర్యపోయాడు.

''అతను అసమాన ప్రతిభావంతుడు జాయా! వెలనాడులోని నాట్యం పట్ల ఆసక్తి ఉన్న యువతీ యువకులంతా కంకుభట్టు గురుకులంలో చేరడం మన నాట్యనియోగ అధికారుల దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన్ను పిలిపించి ఆస్థాన నాట్యాచార్యునిగా గౌరవించాను''.

''ప్రతిభకు వయసు ప్రధానం కాదని నిరూపించావు అన్నా. నేను ఆస్థాన నాట్యాచార్యుడు అంటే ఎంతసేపూ మా గురువుగారు గుండయామాత్యుల వారితో పోల్చి చూస్తున్నాను..'' అనడంతో ఇద్దరూ పకపకా నవ్వారు.

''నేను ఓసారి అతని గురుకులాన్ని సందర్శించాలని అనుకుంటున్నాను''.

''మంచిది.. నేను ఏర్పాట్లు చేస్తాను జాయా!''.

''వద్దు వద్దన్నా. నేను సాధారణవ్యక్తిగా వెళ్లి పరిశీలించాలి అనుకుంటున్నాను''.

ఎదురు చెప్పడు పృథ్వి. ఉదయం పిల్లలతో తలగడ దీవి సముద్రతీరాన నాట్యం నేర్పుతూ ఆడిపాడి భోజనం చేశాక బయటికి కదిలాడు జాయపుడు. ఎప్పుడు ఎక్కడ తిరిగినా.. పిల్లలకోసం కోటకు చేరతాడన్న ఆశ పృథ్విది.

''ఆ జాయా.. కంకుభట్టు గురుకులం నంగెగడ్డ రేవు తీరాన ఉంటుంది. ధనదుప్రోలులో కాదు!''..

ఆశ్చర్యపోయి తల పంకించి కదిలాడు.

కంకుభట్టు నాట్యారామం దగ్గరికి జాయపుడు వెళ్లేసరికి సూర్యుడు పశ్చిమాద్రి వైపు వంగాడు. తదనుగుణంగా నంగెగడ్డ రేవులోని కృష్ణమ్మ అలతి అలతి కెరటాలతో సంగీత కృతులు రచిస్తున్నది. ఆ సంగీత కృతులకు నాట్యరీతులను సవరిస్తున్నట్లు పక్కనే ఉన్న నాట్యారామం ప్రతిధ్వనిస్తున్నది.

కమ్మని ఓ కంఠం.. నట్టువాంగ గాయని కాబోలు.. వినవస్తున్నది. చెవి ఒగ్గి విన్నాడు.

'అరె.. సంస్కృత రచనా??'.

ఉత్సాహంగా మరింత దగ్గరగా వెళ్లి.. తలుపు తోశాడు. అంతే! ఎవరో మెడపట్టి బయటికి తోశారు. విసురుగా ఈవలకు వచ్చి పడ్డాడు.

''అవతల పాఠం జరుగుతుంటే అడ్డమైనోళ్లు తొంగిసూడ్డమేనా? పో అవతలకి. చండాలుడికి, ఎరుకలోడికి, సగరపోడికి కూడా నాట్టెం కావాలి. పో.. అటు పో! ఆడ ఇసకలో తైతక్కలాడతారు. అక్కడికిపో!''..

తోసినవాడు కాపలాదారుడు. లోపలికి తొంగిచూసే వాళ్లను గెంటేయడానికే వాణ్ని పెట్టుకున్నట్టున్నారు. వాడి తప్పేముంది. వాడి నియోగం వాడిది. తనే ఆసక్తితో వాణ్ని చూడకుండా లోపలికి తోసుకెళ్లాడు.

కృష్ణమ్మ అద్దిన చల్లని, మెత్తని మట్టి దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు.

గురువు ఏదో చెబుతూ చేసి చూపిస్తున్నట్లుంది. శిష్యులు కాబోలు.. యువతీయువకులు.. గరగర నవ్వులు. బయటికి వినిపిస్తున్నాయి. ఆసక్తి పెరిగిపోతున్నది.. ఏం చెయ్యాలి?!

'లోపలికి వస్తాను!' అని అభ్యర్థించడానికి కూడా మళ్లా తలుపు తొయ్యాలి. లేదా సౌమ్యంగా తలుపు తట్టాలి. ఈ వెలనాడువాళ్లు సౌమ్యంగా మాట్లాడరు కదా. ఈసారి ఆ కాపలావాడు ఈత చువ్వ పట్టుకుని నాలుగు పీకినా ఆశ్చర్యంలేదు. ఏమీ చెయ్యలేక కాస్త ఆవలగా నిలబడ్డాడు. ఆ నాట్యారామ భవనం జాయపుణ్ని ఆకర్షించింది. చక్కటి పర్ణశాల. రామాయణంలో వర్ణనకన్నా మరింత అందంగా ఉంది. వాల్మీకి చూస్తే రామాయణం తిరగరాస్తాడు. అంత కన్నులపండువగా ఉంది. ఈ గురువు కళాభిరుచిని మెచ్చుకోవచ్చు. ఏం చెయ్యాలో తోచక భవనం చుట్టూ తిరుగుతూ.. దాని అందచందాలను చూస్తూ పులకిస్తున్నాడు జాయపుడు.

మట్టి అడుసుతో కట్టి, పైన రెల్లుగడ్డి కప్పిన విశాలమైన భవనం. ఆవల మరికొన్ని భవంతులు కనిపిస్తున్నాయి. అవి విద్యార్థుల కోసం కావచ్చు. అన్నిటివద్దా చక్కటి తీగెపాదులను పెంచి పైకి పాకించారు. వాటి తీగెలు, పువ్వులు, లేలేత రెమ్మలు వహ్వా.. భవనమంతా చుట్టుకుని గానానికి, గజ్జెల సవ్వడికి తలలూపుతూ.. భలే! మాట పెళుసుగానీ.. సృజనాత్మకత వీళ్లలో అదిరిపోతుంది. భవంతిని చూస్తూ అలా అలా అడుగులు వేస్తూ వెనక్కి వెళ్లాడు. వెనక కంటపడిన దృశ్యం చూసి కొయ్యబారిపోయాడు.

కృష్ణమ్మ అంచుపై కట్టిన ఆ భవంతి వెనక ఏవేవో కర్రలు, చెక్కలు ఉండగా.. వాటిపైకెక్కి ఓ అమ్మాయి లోపలికి తొంగిచూస్తున్నది. గోడపైన, కప్పు కిందుగా ఉన్న కాస్తఖాళీ నుంచి భవనం లోపల జరుగుతున్న కార్యక్రమాన్ని తిలకిస్తున్నదామె. రెండులిప్తల కాలం అలా ఆమెను చూశాడు.

'పాపం.. నాలాంటి అమ్మాయి కావచ్చు. వాడు బయటికి తోసేస్తే.. నాలాగే తమాయించుకోలేక ఈమార్గం ఎంచుకుని ఉంటుంది. నేను కూడా ఇలాగే చూడాలేమో. ఈ పిల్ల నన్ను కూడా కాస్త ఈ చెక్కలు ఎక్కనిస్తుందా.. లోపలికి తొంగి చూడనిస్తుందా..' ■

(సశేషం)

**కమ్మని ఓ కంఠం.. నట్టువాంగ గాయని కాబోలు.. వినవస్తున్నది. చెవి ఒగ్గి విన్నాడు జాయపుడు. 'అరె.. సంస్కృత రచనా??'. ఉత్సాహంగా మరింత దగ్గరగా వెళ్లి.. తలుపు తోశాడు. అంతే! ఎవరో మెడపట్టి బయటికి తోశారు. విసురుగా ఈవలకు వచ్చి పడ్డాడు. తోసినవాడు కాపలాదారుడు. లోపలికి తొంగిచూసే వాళ్లను గెంటేయడానికే వాణ్ని పెట్టుకున్నట్టున్నారు.**